నిరసన తెలుపుతున్న యువజన సంఘం నాయకులు

పాలస్తీనా ప్రజలపైజరుగుతున్న మారణ హోమం ఆపాలి

- ఎఐఎస్ఎఫ్ నాయకులపై బిజెపి, బిజెవైఎం దాడి అమానుషం
- నిరసన చేపట్టిన యువజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమ దాడులను, మానవ హక్కుల హననాన్ని వెంటనే ఆపి శాంతిని నెలకొల్పాలని ఏఐఎస్ఎఫ్ శాంతియుత ఆందోళన చేస్తుంటే బిజెవైఎం, బిజెపి, సంఘ పరివార్ దుండగులు దాడి చేయడం సిగ్గు చేటని, దాడికి యత్నించిన దుండగులను అరెస్ట్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.స్టాలిన్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ నాయకులపై బిజెవైఎం, బిజెపి, సంఘ్ పరివార్ దుండగుల దాడిని నిరసిస్తూ ఆదివారం హైదారబాద్ హిమాయత్ నగర్‌లోని 'వై' జంక్షన్ వద్ద ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగోల్ బండ్లగూడలోని నవ చేతన విజ్ఞాన కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణా తరగతుల సందర్భంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న మారణకాండను ఆపాలని నవ చేతన విజ్ఞాన కేంద్రం ముందు నిరసన చేపడితే బిజెపి, బిజెవైఎం, సంఘ పరివార్ దుండగులు నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునే ఏఐఎస్ఎఫ్, వామపక్ష సంఘాలపై విషాన్ని వెదజల్లి ఇబ్బందులకు గురిచేయాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ చూస్తున్నాయని అన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని యువతలో అమలు చేయాలనే నీచ సంస్కృతికి ఆజ్యం పోస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రతి దాడులకు పాల్పడే ధైర్యం తమకు ఉందని, కానీ సంయమనం పాటిస్తున్నామని తెలిపారు. దాడికి యత్నించిన బిజెవైఎం, బిజెపి, సంఘ పరివార్ నేతలను పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ అమిత్ హంజా, సంఘ మిత్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యులు నాసార్ జీ, వైభవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బానోతు రఘురాం, గ్యార నరేష్, గ్యార క్రాంతి, సాయికుమార్, ఫణి, ప్రతిక్ష తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు

- దేశ సహజ సంపదను అదాని, అంబానిలకు దోచిపెడుతోంది
- హక్కుల సాధనకు కోసం ఐక్యంగా ఉద్యమించాలి : సుభాషిణి అలీ
- మైనార్టీలకు అందని సంక్షేమం : అబ్బాస్
- గద్వాలలో అవాజ్ రాష్ట్ర 3వ మహాసభ ప్రారంభం

మహాసభలో మాట్లాడుతున్న సుభాషిణి అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగంపె బిజెపికి నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపి సుభాషిణి అలీ అన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం బిజెపి, ఆర్ఎస్ఎస్ చేస్తున్నాయని విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో ఆవాజ్ రాష్ట్ర 3వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మక్కా మసీదు నుంచి తేరు మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అతికూర్ రెహమాన్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆమె మాట్లాడారు. సిఎఎ, ఎన్ఆర్‌సి చట్టం వల్ల మైనార్టీల హక్కులకు భంగం కలిగిందని, అందుకే పరదచాటున ఉన్న మైనార్టీ మహిళలు సైతం తమ హక్కుల కోసం రోడ్ల పైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. మైనారిటీల దేశభక్తిని ఎవరూ గుర్తించాల్సిన అవసరం లేదని, తాము భారతదేశ పౌరులమని, అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా తమకు సర్వ హక్కులు కల్పించారని అన్నారు. స్వశక్తితో అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళుతుంటే బీజేపీ మాత్రం మహిళల హక్కులను నిరాకరిస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను హరిస్తే తిరగబడతామని హెచ్చరించారు. 'భేటీ పడావో భేటీ బచావో' అంటూ నినాదాలు ఇస్తున్న బిజెపి.. తాను అధికారంలో ఉన్న యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అమ్మాయిలపై జరుగుతున్న అరాచకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకలి, పేదరికం, నిరుద్యోగం పెరిగిందని, వాటి నుంచి తప్పించుకోవడానికి మతాన్ని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు. మోడీ.. అంబానీ, అదానీకి దేశ సహజ వనరులను దోచుకోవడానికి అవకాశమిచ్చారని అన్నారు. రైతులు, కూలీలు, కార్మిక వర్గాన్ని మాత్రం దోపిడీకి గురి చేస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. తమ ఆర్థిక, రాజకీయ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి విద్వేష రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. బీజేపీని నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ తన ఆలోచనలను ప్రభుత్వ విధానాల్లో అమలు పరుస్తున్నదని, అందులో భాగంగా శాస్త్రీయ విద్యకు తిలోదకాలు ఇచ్చి మతపరమైన అంశాలు విద్యలోకి చొప్పించ్చిందని విమర్శించారు. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నెహ్రు, అంబేద్కర్ బొమ్మలను ధ్వంసం చేసిన ఆర్ఎస్ఎస్‌కు, భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని బీజేపీకి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, కానీ ఆ సమానత్వాన్ని బిజెపి నిరాకరిస్తున్నదని విమర్శించారు. కులం, మతం, జాతుల మధ్య విభజన వాదాన్ని సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనం పొందుతున్న బిజెపి ఆలోచనా విధానాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఐక్యంగా ఉంటే తమ ఆటలు సాగవని, రాజ్యాంగాన్ని మార్చలేమని గుర్తించి ప్రజల మధ్య విద్వేష రాజకీయాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ముస్లిం మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించి వారిని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఐదువేల మైనారిటీ పాఠశాలలను మూసివేశారని అన్నారు. మైనారిటీలు లేకపోతే ప్రభుత్వాలు సైతం నిలబడవన్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ మాటలు బిజెపి నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. సెక్యులరిజం కోసం నిలబడాలంటే దమ్ము, ధైర్యం ఉండాలని, మైనారిటీలుగా తాము నిలబడతామని, మీకు ఆ దమ్ముందా అని బిజెపిని ప్రశ్నించారు. ఎంత పేదరికంలో ఉన్నా హక్కులకు భంగం వాటిల్లితే చూస్తూ ఊరుకోరాదని, ప్రజలు జాగృతమై సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మైనార్జీలకు సంక్షేమం అందడం లేదు
ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

మైనార్టీలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. మైనార్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ అన్నారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని తెలిపారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, అంబేద్కర్ రాజ్యాంగ ప్రకారం అందరికీ సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. యువకులకు, భిన్న కులాలకు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బ్యాంకు లింక్ లేకుండా మైనారిటీ కార్పొరేషన్ నుంచి రుణాలివ్వాలని, వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం, ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరితమ్మ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నదన్నారు. విద్యా ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు కల్పించి, సంక్షేమ పథకాల అమలుకు ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ఈ సభకు అవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.వెంకటస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్, న్యాయవాది మధుసూదన్ బాబు, అఖిల పక్ష నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు తాహేర్, మాజీ కౌన్సిలర్ ఇషాక్, నాయకులు ఇక్బాల్, పాషా, సుంకర ప్రభాకర్, కుర్వ పల్లయ్య, గంజిపేట రాజు, సిఐటియు నాయకులు వివి నర్సింహ, ఉప్పేర్ నర్సింహ, ఐద్వా నాయకులు నర్మద, వివిధ సామాజిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ వెటర్నరీ వైద్యులు, రైతుల కోసం ద్విభాషా త్రైమాసిక జర్నల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీల్డ్ వెటర్నరీ వైద్యులు, రైతుల ప్రయోజనాల కోసం ద్విభాషా త్రైమాసిక పత్రిక అందుబాటులోకి వచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లోని విజయనగర్ కాలనీ వెట్స్ హోమ్‌లో జరిగిన కార్యాక్రమంలో ఆ జర్నల్‌ను రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎం.వి.రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాగజైన్ ప్రచురించాలని అసోసియేషన్ చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. ఫీల్డ్ వెటర్నరీ వైద్యులకు జ్ఞానాన్ని రిఫ్రెష్ చేయడంతో పాటు పశుసంవర్ధక పద్ధతులపై తాజా నవీకరణలను రైతులు తెలుసుకునేందుకు జర్నల్ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచురణకు అంతరాయం కలగకుండా సీజీ కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అనంతం కార్యక్రమానికి స్వాగతం పలికారు. మ్యాగజైన్‌ను తీసుకురావడంలో చేసిన ప్రయత్నాల గురించి వివరించారు. చీఫ్ ఎడిటర్ డాక్టర్ కొండల్ రెడ్డి ద్విభాషా త్రైమాసిక జర్నల్ లక్ష్యాలను తెలిపారు. ఎడిటోరియల్ బోర్డు సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ సుధాకర్ రావులను పరిచయం చేశారు. మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ పశువుల పెంపకంపై తాజా సమాచారాన్ని అందించడం ద్వారా పశువుల రైతులకు సేవ చేస్తున్నందుకు అసోసియేషన్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ దుర్గయ్య, కెవిఎల్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృత్తికి చేసిన అమూల్యమైన సేవలకుగాను ఐదుగురు సీనియర్ పశు వైద్యులకు పురస్కారాలు అందజేశారు.

అవినీతి బయటపెడుతుంటే తట్టుకోలేకే బిఆర్ఎస్ దాడులు : టిజెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ అవినీతిని బయటపెడుతుంటే తట్టుకోలేకే బిఆర్ఎస్ నాయకులు దాడులకు తెగబడుతున్నారని తెలంగాణ జన సమితి (టిజెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుచరులు తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడిని ఖండించారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన నాయకులు వీధి పంచాయితీలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరువుకు భంగం కలిగిస్తే మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప దాడులు చేయడం సరికాదని సూచించారు.

గీత, రాత పూర్తిగా తెలిసిన కార్టూనిస్ట్ శేఖర్

- త్వరలో ఆయన కార్టూన్ల ప్రదర్శన
- శేఖర్ మెమోరియల్ అవార్డుల ప్రదానోత్సవంలో ఎస్ వినయకుమార్
- ఆయన విలువలను కొనసాగిద్దాం : సీనియర్ జర్నలిస్ట్ కూర్మనాథ్

సభలో మాట్లాడుతున్న కూర్మనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గీత, రాత పూర్తిగా తెలిసిన కార్టూనిస్ట్ శేఖర్ అని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శేఖర్ కుటుంబ సభ్యులు, మిత్రులు, ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డులు-2025 ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ రఘు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ దినపత్రిక కార్టూనిస్ట్ మత్యుంజయ, చిత్రకారులు చిత్ర కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు -2025ను అందుకున్నారు. అవార్డుతో పాటు రూ.10,116 నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను నిర్వాహకులు అందజేసి ఇరువురిని సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినయకుమార్ మాట్లాడుతూ ప్రజాశక్తిలో హైదరాబాద్ ఇన్‌చార్జిగా తాను, కార్టూనిస్ట్‌గా శేఖర్ కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. శేఖర్ కార్టూన్ వేస్తే మార్చాల్సిన అవసరముండేది కాదన్నారు. చాలా మంది కార్టూనిస్ట్‌ల గీత బాగుంటే రాత బాగుండదనీ, రాత బాగుంటే గీత బాగుండదని తెలిపారు. ఆ తరం కార్టూనిస్టులు నవలలు, సాహిత్యం ఎక్కువగా చదివేవారని తెలిపారు. నేటి తరం అలాంటి లక్షణాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. శేఖర్ లేని లోటు తెలుగు కార్టూన్లను చూస్తుంటే తెలుస్తున్నదని చెప్పారు. హిందీ కార్టూన్‌లలో వస్తున్నట్టు వ్యాఖ్యలు తెలుగు కార్టూన్లలో కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. నాటి కరుకుదనమూ కనిపించడం లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులకు తగినట్టు కార్టూన్లు రావడం లేదని తెలిపారు. త్వరలోనే హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శేఖర్ కార్టూన్ల ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు.

కార్టూన్లతో శ్రమ దోపిడిని ఎండగట్టారు : కూర్మనాథ్

తన జీవితాంతం ప్రజల కోసం కార్టూన్లు వేసిన శేఖర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని సీనియర్ జర్నలిస్టు, రచయిత కె.వి.కూర్మనాథ్ అన్నారు. కార్యక్రమంలో ఆయన స్మారకోపన్యాసం ఇచ్చారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి 45 వేల కార్టూన్లు వేశారని తెలిపారు. ఆ కార్టూన్లు ఉమ్మడి రాష్ట్రంలోని మూడు దశాబ్దాల చరిత్రకు అద్దం పడతాయని తెలిపారు. మత, కుల రాజకీయాలు, సమాజంలో అసమానతలు, శ్రామికుల శ్రమ దోపిడీని తన కార్టూన్లతో ఎండగట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ విధానాలను నిలదీసేవారని తెలిపారు. లౌకికవాదాన్ని అంకితభావంతో ఆచరించారని చెప్పారు. మత విద్వేష భావజాలం పెరిగిపోయిన ప్రస్తుత కాలంలో శేఖర్ కార్టూన్ వేస్తే అరెస్టు చేసేవారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక చైర్మెన్ తిప్పర్తి యాదయ్య, కార్టూనిస్ట్ శంకర్, చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, ప్రజా వాగ్గేయకారులు చింతల యాదగిరి, హైదరాబాద్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధి రమణారెడ్డి, శేఖర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మంచి స్నేహితున్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శేఖర్ సతీమణి చంద్రకళా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత మార్గంతోనే విజయం

- గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల్లో మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతియుత మార్గంతోనే విజయం సాధ్యమనీ, గాంధేయ సిద్ధాంతమే దేశానికి శ్రీరామరక్ష అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఏర్పాటు చేసి 50 ఏండ్లు అవుతున్న సందర్భంగా గాంధీ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి వారి త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి సమాజానికి గుర్తు చేస్తున్నారని కొనియాడారు. గాంధీ బాటలోనే నడిచి నియంతలను, దుర్మార్గులను తరిమి కొట్టామన్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. అందులో భాగంగా జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మహనీయుల దారిలోనే నడిచి ప్రజలకు మేలు చేస్తామన్నారు. ఎప్పటికైనా శాంతి సామరస్యతే గెలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, తదితరులు పాల్గొన్నారు.

'కోట'తో ఆత్మీయ అనుబంధం

- ఆయన మరణం బాధాకరం : కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి
- త్రిపుర, హర్యానా రాష్ట్ర గవర్నర్లతో పాటు పలువురు నేతల సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలక్షణ సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావుతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు. సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాల ప్రయాణంలో 750కిపైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు సినీపరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారని కొనియాడారు. సామాజిక విలువలు, భాషా పరిరక్షణ విషయాల్లో యువతలో చైతన్యం నింపేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపిన వారిలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బిజెపి తెలంగాణ అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు, బిజెపి ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపిలు డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితరులున్నారు.

కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు : మంత్రి సీతక్క, పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోట శ్రీనివాసరావు మృతికి టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ సంతాపం తెలిపారు. ఆయన మృతిని బాధాకరమని పేర్కొన్నారు.

ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తాం

- అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తామని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలకేంద్రంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, అబ్కారీ, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఇందులో భాగంగానే లక్షెట్టిపేట మండలకేంద్రంలో రూ.8.50 కోట్లతోపాటు మరో రూ.కోటి సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా సంవత్సరానికి రూ. 20 వేల కోట్లను వడ్డీలేని రుణంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు నడిపించేందుకు 600 బస్సుల ప్రతిపాదనలో 150 బస్సులను ఇచ్చామని, త్వరలో 450 బస్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతు సంక్షేమంలో భాగంగా 70 లక్షల రైతు కుటుంబాలకు రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయం అందించినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను రూ.22,500 కోట్లతో లబ్ధిదారులకు అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఐటిడిఎ పిఒ ఖుష్బూ గుప్తా, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిసిసి చైర్మెన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగుల సహాయానికి హెల్ప్‌లైన్

- ప్రతి రోజు మూడున్నర వేల మంది కాల్స్
- మూడేళ్లలో 21 లక్షల కాల్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెలిమానస్‌కు పెరుగుతున్న స్పందననస్ మానసిక రోగుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్. క్షణాకావేశంలో కఠిన నిర్ణయాల దిశగా మనసు మన అధీనంలో లేకుండా పోవటాన్ని నిరోధించేందుకు చేసిన ప్రయత్నం. మారిన పరిస్థితిలు, జీవనశైలి, వేగవంతమైన జీవితం, ఆర్థిక స్థితిగతులు, పెరుగుతున్న కోరికలు, స్వార్థం మానవ సంబంధాలను నిర్దేశిస్తూ, మానసిక ఆరోగ్యాన్ని శాసిస్తున్నాయి. అది శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తూ మానవ వనరులను నిర్వీర్యం చేస్తున్నాయి. పైకి సంపూర్ణ ఆరోగ్యంగా కనిపించే వారు సైతం మానసిక రోగులుగా మారుతూ చికిత్స కోసం ఎదురు చూస్తుంటారు. అయితే సమాజంలో వివక్షకు, చిన్నచూపుకు గురవుతామనే భయంతో సకాలంలో మానసిక వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స తీసుకునేందుకు భయపడుతుంటారు. ప్రాథమిక దశలో, మానసిక ఒత్తిడి సమయంలో వైద్యున్ని సంప్రదించకు సిగ్గు, బిడియంతో వాటిని దాచుకోవడంతో ఆ రోగాలు తీవ్రంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల గోప్యతకు భంగం కలగకుండా సేవలందించేందుకు టెలిమానస్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలంటూ నిపుణులు చేసిన సూచన మూడేళ్ల క్రితం కార్యరూపం దాల్చింది. ప్రతి రోజు 24 గంటలు పని చేసేలా దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన టెలిమానస్ హెల్ప్ లైన్ 21441645/ 1800-891-4416 సేవలను 21 లక్షల మంది వినియోగించుకున్నారు.

మనిషిని సతమతం చేస్తున్న రోగాల్లో 15 శాతం మానసిక రోగాలే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. 1993 నాటికి 6 నుంచి 7 శాతానికి పరిమితమైన మానసిక రోగాలు 2020 నాటికే గణనీయంగా పెరిగినట్టు గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటేటా పెరుగుతున్న మానసిక రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఆయా దేశాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించింది. దీంతో భారతదేశంలో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక విధానాన్ని రూపొందించుకునేందుకు పాలసీ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఆ గ్రూప్ 2013లో ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది. పేదరికం, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటు, శారీరక వికలాంగులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర పునరావాస కేంద్రాల్లో ఉంటున్న పిల్లలు, మహిళలు, ఇతరులు, అనాథలు, ప్రకృతి, మానవ తప్పిదాల ప్రమాదాల బాధితులు, మానవ అక్రమ రవాణాకు గురైన వారితో పాటు జీవనోపాధి కోసం ఉన్నఫళంగావలసలు తప్పనిసరిగా మారిన వారిని రిస్క్ గ్రూప్‌గా గుర్తించింది. వారి మానసిక ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని సూచించింది.

ఈ క్రమంలో మానసిక ఆరోగ్య విధానం అమల్లో భాగంగా వచ్చిందే టెలిమానస్. దేశవ్యాప్తంగా 53 సెంటర్ల ద్వారా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్హాన్స్) దీనిని నిర్వహిస్తున్నది. బెంగుళూరు ట్రిబుల్ ఐటి సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నది. తెలుగుతో పాటు మొత్తం 20 భాషల్లో ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి వైద్య నిపుణుల సలహాలను ఉచితంగా తీసుకునేందుకు వీలు కల్పించింది. 2022 అక్టోబర్ 10న హెల్ప్‌లైన్ ప్రారంభం కాగా 2023 ఏప్రిల్ నాటికి ఒక లక్ష కాల్స్ దాటాయి. అదే ఏడాది డిసెంబర్ నాటికి 11.5 లక్షల కాల్స్ ను స్వీకరించారు. 2024 మే నాటికి పది లక్షలు, ఏప్రిల్ నాటికి 15 లక్షలు కాల్స్ రాగా, ఈ ఏడాది మార్చి నాటికి ఏకంగా 20 లక్షలు దాటాయి.

కాల్ చేయండి : ప్రాజెక్ట్ మేనేజనర్ అర్చన కార్తీక్

మానసిక ఒత్తిడితో ఉన్నవారు టెలిమానస్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలని టెలిమానస్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బెంగుళూరు ప్రాజెక్ట్ మేనేజర్ అర్చన కార్తీక్ సూచించారు. డిప్రెషన్, కుటుంబ సమస్యలు, చదువులో ఒత్తిడి, ఆత్మహత్యల గురించిన ఆలోచనలు, మాదద్రవ్యాలకు వ్యసనపరులుగా మారినవారు, జ్ఞానపశక్తి సమస్యలు, ఆర్థిక ఒత్తిడి, నిద్రలేమి, పరీక్షల ఒత్తిడితో బాధపడుతున్న వారు ..ఇలా అనేక రకాలుగా మానసిక ఒత్తిడిలో ఉన్నవారి నుంచి హెల్ప్‌లైన్‌కు ఎక్కువగా కాల్స్ వస్తున్నట్టు ఆమె తెలిపారు. సమాజంలో మానసిక వ్యాధుల పట్ల అవగాహన మరింత పెరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సమాజంలో వివక్షతో పాటు అవగాహన లేమి కారణంగా మానసిక వైద్యుల వద్దకు వెళ్లడం లేదని చెప్పారు. గోప్యతను కోరుకుంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలనుకునే వారికి టెలిమానస్ ఊరటనిస్తుదని అర్చన కార్తీక్ వెల్లడించారు.

వీడియో కన్సల్టేషన్ విస్తరణ : ప్రొఫెసర్ టికె శ్రీకాంత్

మూడేళ్ల ప్రస్థానంలో టెలిమానస్ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తించినట్టు బెంగుళూరు ట్రిబుల్ ఐటీ ఈ-హెల్త్ రీసెర్చ్ విభాగాధిపతి ప్రొఫెసర్ టికె శ్రీకాంత్ తెలిపారు. కాల్స్ చేస్తున్న వారిలో మానసిక ఆరోగ్య సమస్యలు ప్రాథమిక స్థాయిలో ఉన్నవారితో పాటు తీవ్రమైన స్థితికి చేరిన వారుంటున్నారు. తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలున్నవారికి వీడియో కన్సల్టేషన్ అవసరమని తెలిపారు. వారి కోసం పైలెట్ ప్రాజెక్టుగా కర్ణాటక, తమిళనాడు, జమ్ముకాశ్మీర్‌లో వీడియో కౌన్సిలింగ్ సేవలను ప్రారంభించినట్టటు తెలిపారు. ఒక్కో కేంద్రంలో ఒక్కో షిఫ్టులో నలుగురు ఉంటారనీ, ఈ సేవలో వైద్యులు, ఎనిమిది మంది కౌన్సెలర్లు సేవలందిస్తారని చెప్పారు.

BEFORE THE HON'BLE KARNATAKA REAL ESTATE APPELLATE TRIBUNAL BENGALURU
F.R. No. 66/2024
BETWEEN : ANAND RATHI GLOBAL FINANCE LTD., A Non-Banking Finance Company, Having its registered office at 4th Floor, Silver Metropolis, Jai Coach Compound, Opposite Bimbisar Nagar Goregoan (East) Mumbai, Maharashtra, India 400063. ...Appellant
AND : WELFARE ASSOCIATION & ORS ...Respondents
NOTICE/SUMMONS TO RESPONDENT No. 4
Pratap Satyanarayana Kunda, Founder Director and Promoter of Commune Properties India Pvt. Ltd., Residing at 8-2-703/4p Road, No. 12, Banjana Hills, Hyderabad, Telangana-500034.
WHEREAS, the Appellant have preferred the aforementioned suit against yourself and other Respondent No. 2 seeking the memorandum of claim petition under section 44(1) of THE REAL ESTATE ACT 2016 READ WITH RULE 33 OF THE KARNATAKA REAL ESTATE RULES, 2017. Notice is hereby given to you to appear before this Hon'ble Tribunal and produce all the documents upon which you intend to rely in support of your defense, either in person or through an Advocate, duly instructed or someone authorized by law to appear on your behalf in the said appeal on 21.07.2025 at 11.00 A.M.
Take notice that, in default of your appearance on the said day mentioned, the suit would be heard and determined in your absence.
Given under my hand and seal of the Tribunal, this 23.06.2025.
By order of the Tribunal, M. Mahesh Babu, Registrar, The Karnataka Real Estate Appellate Tribunal, Bengaluru.
Address for Service :
THAKUR & SINHA LAW OFFICES
(Advocate & Solicitors)
No. 117, Ashwini Arcade, 3rd Floor, Sanjaynagar Main Road, RMV II Stage, Ashwathnagar, Bangalore-560094. Mob : 6360920839
Email ID : rishabh.thakur@tslo.in

వైభవంగా లష్కర్ బోనాలు

- ఉజ్జయినీ మహంకాళి దర్శనానికి భారీగా తరలివచ్చిన యాత్రికులు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్ రెడ్డి
- తొలిబోనం సమర్పించిన మంత్రి పొన్నం దంపతులు
- పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ
- నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లష్కర్ బోనమెత్తింది. ఆదివారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతాల ప్రజలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది విచ్చేశారు. మహంకాళి అమ్మవారి దర్శనం కోసం ప్రజలు ఉదయం నుంచే క్యూలైన్‌లలో బారులు తీరారు. దాంతో ఆలయ పరిసరాలు యాత్రికులతో కిటకిటలాడాయి. మహిళల బోనాలు, కోలాటాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాల కోలాహలాలు అధ్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాది మంది మహిళలు, సందర్శకులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 11.40 గంటలకు ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, ఈవో గుత్త మనోహర్ రెడ్డి స్వాగతం పలికారు. సిఎం వెంట మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు తదితరులున్నారు. అనంతరం అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. తెలంగాణ ప్రజలను చల్లగా చూడాలనీ, అందరూ బాగుండాలని అమ్మవారిని కోరుకున్నట్టు సీఎం తెలిపారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో దేవాలయానికి రాగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, మొదటి బోనం సమర్పించారు. ఉదయం 4.10 గంటలకు పొన్నం దంపతులు మొదటి పూజ నిర్వహించారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పొన్నం.. రాష్ట్రమంతా మంచి వర్షాలు, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అవ కాశం కల్పించారు.

మహంకాళి అమ్మవా రి దర్శనానికి పలువురు..

శ్రీఉజ్జయినీ మహం కాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుటుంబ సభ్యులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, తలసాని శ్రీనివాస్ యాదవ్, చామకూరు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, టిపిసిసి ఉపాధ్యక్షులు కోట నీలిమ, మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, పలువురు హైకోర్టు జడ్జీలు, షిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ఆర్యవైశ్య కమిషన్ కాల్వ సుజాత అమ్మవారిని దర్శించుకున్నారు.

అలాగే అమ్మవారిని దర్శించుకున్న వారిలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు. బోనాల జాతరను పురస్కరించుకొని దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు, బోనాల సమర్పించే మహిళలకు రెండు క్యూలైన్లు, వీఐపీలకు ఒక క్యూలైన్ ఏర్పాటు చేశారు. మొత్తం ఆరు క్యూలైన్ల ద్వారా సందర్శకులు యాత్రికులకు అమ్మవారి దర్శనం కల్పించారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల నుంచి ఇతర మార్గాల వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రధానంగా పోలీస్ అధికారులు జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ.. కొందరి అత్యుత్సాహం కారణంగా సందర్శకులు, మీడియా ప్రతినిధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇక జలమండలి, జిహెచ్ఎంసి అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న భవిష్యవాణి (రంగం) కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సిఎం రేవంత్ రెడ్డి

పాశమైలారంలో మరో అగ్నిప్రమాదం

- ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్న పరిశ్రమ వర్గాలు, అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి పరిశ్రమ ఘోర ప్రమాదం కళ్ల ముందు నుంచి మరవకముందే ఆదివారం మరో పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లో కెళితే.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశ మైలారం పారిశ్రామిక వాడలోని ఎన్‌విఆర్‌ఒ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో ఫార్మా, ఆస్పత్రులు, రసాయనాల పరిశ్రమల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారు. ఇలా పరిశ్రమలో ఆదివారం ఉదయం లారీ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు వెదజిమ్ముతూ ఆ ప్రాంతమంతా మంటలు, పొగలు కమ్ముకోవడంతో పారిశ్రామిక వాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పూర్వాపరాలను పరిశీలించారు. ఈ సంఘటనలో ఒక లారీ దగ్ధమవటం మినహా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. పరిశ్రమలో మంటలు ఎగిసిపడటంపై షార్ట్ సర్క్యూట్, మరేదైనా కారణమా అనే కోణంలో పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఎలాంటి ప్రాణం నష్టం జరగకపోవడంతో ఇటు పరిశ్రమ వర్గాలు, అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదం సంఘటన మరచిపోకముందే మరో పరిశ్రమలో అలాంటి ప్రమాదమే చోటు చేసుకోవడంతో కార్మికులు భయందోళనకు గురవుతున్నారు. అగ్ని ప్రమాదాలు పునరావృతం అవుతున్నా యజమాన్యాలు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ, కార్మాగార యాజమాన్య బాధ్యతలు, కార్మికుల రక్షణ వంటి అంశాలపై పరిశ్రమల శాఖ అధికారులు, ప్రభుత్వం అవలంబించే విధానాలను కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



తనికెళ్ల భరణి నాటికలు సర్వకాలీనం

- ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనికెళ్ల భరణీ ఏళ్ల క్రితం రాసిన నాటికలు నాటకాలు సర్వకాలీనం అని.. నేటికీ అందులోని కథాంశాలు వర్తిస్తాయని ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై సంగమం ఫౌండేషన్ నిర్వహణలో రెండు రోజుల పాటు జరిగే ప్రముఖ నటుడు నాటక రచయిత తనికెళ్ళ భరణి నాటికలు ప్రదర్శన ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ.. తెలుగు నుడికారానికి పరికిణీ, నటనకు పట్టు చీర కట్టిన ప్రతిభావంతుడు భరణి అన్నారు. ఆయన నాటికలు సమాజంను చైతన్యం దిశగా నడిపించేవి అని చెప్పారు. ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. భరణి డైలాగ్‌లు నవ్వించటం ఏడిపించగల సత్తా ఉందని చెప్పారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, శాంత బయోటెక్ అధినేత వర ప్రసాద్ రెడ్డి, నటి జయలలిత, నటుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరణి రచించిన నాటికలు జంబూ ద్వీపం, చల్ చల్ గుర్రం, గోగ్రగణం నాటికలు ప్రదర్శించారు. సంస్థ నిర్వహకులు సంజయ్ కిశోర్ పర్యవేక్షణలో ఉదయం ప్రఖ్యాత రచయిత విజయ భాస్కర్ నిర్వహణలో తనికెళ్ళ భరణి నాటికలు ప్రయోగసీలత అంశంపై సదస్సు నిర్వహించారు.

బెట్టింగ్ యాప్స్‌ను పూర్తిగా నిషేధించాలి

- ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలు, ఇన్‌ఫ్లుయేన్సర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ గోల్కొండ చౌరస్తాలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయేన్సర్స్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడంతో వాటికి ఆకర్షితులవుతున్న యువత డబ్బులు పోగొట్టుకొని అప్పులతో మానసికంగా కుంగిపోయి అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్‌లో మొదట లాభాలను చూపించి తర్వాత మొత్తం డబ్బులను కాజేస్తున్నాయన్నారు. అప్పులు చేసి మరీ ఆన్‌లైన్‌లో బెట్టింగ్స్ ఆడుతూ మోసపోతున్నారని, చివరకు ప్రాణాలనూ బలి తీసుకుంటున్నారని తెలిపారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, బెట్టింగ్ యాప్స్‌లో డబ్బుల కోసం దురాలవాట్లకు పాల్పడి.. సొంత తల్లితండ్రులపైనే దాడులు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెట్టింగ్ యాప్స్‌ను పూర్తిగా నిషేందించాలని, యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నవారు ఎంతటివారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావేద్, జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, రాజయ్య, రవి, పావని, భానుకిరణ్, నాయకులు శ్రీను, కార్తీక్, జావీద్ సతీష్, జగదీష్, విజయలక్ష్మి, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బోనాల సంస్కృతి సాంప్రదాయం

ప్రజాశక్తి - కల్చరల్

బోనాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయంలో ప్రధాన భాగం అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ సంస్థ నిర్వహణలో గురు పూర్ణిమ మహోత్సవంతో పాటు బోనాలు సంబరాలు పాటలు నృత్యాలతో సందడి సందడిగా జరిపారు. నాట్య గురువులు దాసరి కృష్ణ ప్రియ, టి స్వాతి, గోపి కృష్ణ నాయుడు, సుధా కామేశ్వరి, ఛాయా చంద్రిక, జయ లక్ష్మీ శైలజ తదితరుల శిష్య బృందం వంద మంది పైగా తమ శాస్త్రీయ జాన పద నృత్యాలతో వేదికను ఊపేవారు. సంగీత గురువులు శ్రీ విద్య భాస్కరభట్ల, నవ్య, హనుమంత్ ప్రసాద్, సుధా కమల,నాగ జ్యోతి, భువనేశ్వరి తదితరులు శిష్య బందం వాగ్గేయ కారులు కీర్తనలతో పాటు బోనాలు జానపద గీతాలు పాడి శ్రోతలను హుషార్ చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయ కళలను ముందుకు తీసుకువెళ్ల వలసింది నేటి తరం వారే అన్నారు. గురువులను గౌరవించడాన్ని తల్లి తండ్రులు తమ పిల్లలకు నేర్పాలి అని చెప్పారు ప్రొఫెసర్ శోభా దేశపాండే, ప్రొఫెసర్ కాంత కుమారి, చకిలం సుధాకర్, జయ తీర్థ, లక్ష్మీకిరణ్ తదితరులు పాల్గొనగా అధ్యక్షత వహించిన భారత్ వరల్డ్ రికార్డ్స్ స్థాపకుడు రమణా రావు పాల్గొన్న కళాకారులకు ప్రశంస పత్రలు జ్ఞాపికలు బహుకరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే కొత్త కమిటీలు

- ఉమ్మడి వరంగల్ కమిటీ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే మండల, బ్లాక్, గ్రామస్థాయిలో కొత్త కమిటీలను నియమించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేతలు నిర్ణయించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర అంశాలపై సమావేశంలో నేతలు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. కొత్త కమిటీల్లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. మండలానికి ఐదుగురి చొప్పున పేర్లను ఫైనల్ చేశారు.

కవితనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ

తీన్మార్ మల్లన్న ఆఫీసుపై'జాగృతి' కార్యకర్తల దాడి

- గన్‌మెన్ కాల్పులు
- దాడులతో బిసి ఉద్యమాన్ని ఆపలేరన్న మల్లన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసు (క్యూ న్యూస్)పై జాగృతి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఎమ్మెల్సీ కవితనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆదివారం మేడ్చల్ జిల్లా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బోడుప్పల్‌లోని ఆయన కార్యాలయం, సిబ్బందిపై జాగృతి కార్యకర్తలు దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన గన్‌మెన్‌లపైనా దాడికి పాల్పడ్డారు. దాంతో మల్లన్నను కాపాడాలని గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. ఆఫీసులో గ్లాస్ ఫర్నిచర్ పెచ్చులు గుచ్చుకుని ఇరువర్గాలకు గాయాలు కావడంతో ఆఫీసు మొత్తం రక్తంతో నిండిపోయింది. సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

ఇక తేల్చుకుందాం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీస్‌పై దాడి ఘటనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందించారు. ఆఫీస్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. దాడులతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఇలాంటి దాడులకు మల్లన్న భయపడతాడనుకుంటే.. భ్రమే అవుతుందని తెలిపారు. తన గన్‌మెన్ వద్ద ఉన్న తుపాకీ లాక్కొని మరీ సిబ్బందిపై దాడి చేశారని, తనతో సహ పలువురికి గాయాలయ్యాయని చెప్పారు. కల్వకుంట్ల కవిత, ఆమె కుటుంబం తనపై హత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపించారు. ఇక ఊరుకోబోమని హెచ్చరించారు. తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'కంచం-మంచం' అనేది తెలంగాణలో ఊతపదమని, తాను చేసిన వ్యాఖ్యలకు ఇంకా కట్టుబడే ఉన్నానని తెలిపారు. తానేం తప్పు మాట్లాడానో ప్రజలు నిర్ణయిస్తారని, రౌడీల్లా దాడి చేయడమే కాకుండా.. ఎదురు కేసు పెట్టారన్నారు. తన రక్తం కళ్లజూశారని, ఆ రక్తం మరకలతోనే ప్రజల్లోకి వెళ్తానన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించాలని కోరారు. ఈ దాడిపై ఇప్పటికే కంప్లైంట్ చేశామని, పోలీసులపై, వ్యవస్థపైనా నమ్మకముందని, న్యాయం జరుగుతుందనే నమ్ముతున్నామని తెలిపారు.

మల్లన్నను సస్పెండ్ చేయాలి

- ఆయన వ్యాఖ్యలు క్షమించరానివి : కవిత
- మండలి చైర్మన్ గుత్తాకు ఫిర్యాదు

గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను వెంటనే ఆ పదవి నుంచి సస్పెండ్ చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తనపై అనుచిత వాఖ్యలు చేశారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. విచక్షణాధికారాలు ఉపయోగించి ఆయన్ను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని ఆమె కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని అన్నారు. "తెలంగాణలో మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఉంది. బోనం ఎత్తుకున్న ఆడబిడ్డను అమ్మవారిలా చూసే సంస్కృతి మనది. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు పరుషపదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుంది. ఉచ్చరించలేని దారుణమైన వ్యాఖ్యలను మల్లన్న చేశారు. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా? ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలి. ఏడాదిన్నరగా బిసి సమస్యలపై తెలంగాణ జాగృతి తరపున పోరాటం చేస్తున్నాం. ఏ రోజూ తీన్మార్ మల్లన్నను ఒక్క మాట అనలేదు. ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన జాగృతి కార్యకర్తలపై కాల్పులు జరుపుతారా? ఇది ప్రజాస్వామ్యం. దీనిలో అనేకమంది ప్రజల జీవితాలు ముడిపడి ఉన్నాయి.

డిజిపికి ఫిర్యాదు

తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై డిజిపికి కవిత ఫిర్యాదు చేశారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో ఆమె ఆదివారం డిజిపి కార్యాలయానికి వచ్చారు. "గన్ మెన్స్ ఎందుకు ఫైర్ చేయాల్సి వచ్చిందో తెలియాలి. మల్లన్న ఆదేశాలు లేకుండా గన్ మెన్స్ షూట్ చెయ్యరు. మా కార్యకర్తలపైన కాల్పులు జరిపిన తీన్మార్ మల్లన్న గన్మెన్లను వెంటనే డిస్మిస్ చెయ్యాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఏ గన్‌మెన్ కానీ పోలీసులు కానీ కాల్పులు జరపలేదు" అని కవిత వ్యాఖ్యానించారు. సంఘటనపై లోతైన దర్యాప్తు చేయాలని కోరారు.

కవిత ఇంటి వద్ద బందోబస్తు

తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి అనంతర పరిస్థితుల నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసం, కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కవిత ఇంటికి వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అటు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

యువకుడు దారుణ హత్య

- పెళ్లయిన రెండు నెలలకే మహమ్మద్ తాజుద్దీన్ మర్డర్
- సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మోహళ్ల ప్రాంతానికి చెందిన మహమ్మద్ తాజోద్దీన్ (26) శనివారం మధ్యాహ్నం పట్టణంలోని జామే మసీద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి అదే కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు తాజోద్దీన్‌ను బైక్‌పై తీసుకొని వెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో హత్య చేశారు. అనంతరం గోనె సంచిలో కట్టి రహమత్ నగర్ వద్దనున్న సర్వే నంబర్ 92/ఆ మచ్కురి చంద్రయ్య వ్యవసాయ బావిలో పడేశారు. కాగా, నమాజ్‌కు వెళ్లిన తాజోద్దీన్ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సిసి పుటేజీ ఆధారంగా విచారణ ప్రారంభించారు. అదే కాలనీకి చెందిన ఇద్దరు దుండగులు తాజోద్దీన్‌ను ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లినట్టు పరిశీలించి, వారిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసి మృతదేహాన్ని బావిలో పడేసినట్టు నిందితులు అంగీకరించారు. వారిచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆసాముల బతుకు చీకటి!

- ప్రభుత్వ ఆర్డర్లతో చేతినిండా పని ఉన్నా.. మిగిలేది సున్నా..
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పెట్టుబడిదారులదే పైచేయి
- శ్రమ ఆసాములది, లాభం సేట్లకు
- మీటరుకు రూ.6 కూలితో ఖర్చులు పోను మిగిలేది అప్పులే!
- కార్మికుల కొరతతో గడువులోపు ఉత్పత్తి పూర్తి చేయలేని దుస్థితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరా మహిళా శక్తి' చీరల పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొన్ని కోట్ల మీటర్ల ఆర్డర్లు వెల్లువెత్తాయి. రెండేళ్లుగా పని కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు ఉపాధి భరోసా లభించింది. ఈ ప్రభుత్వ ఆర్డర్లు దక్కించుకున్న బడా యజమానుల ఖజానాలు నిండుతున్నాయి కానీ, ఈ మూడంచెల వ్యవస్థలో కీలకమైన 'ఆసామి' (మరమగ్గాల నిర్వాహకుడు) మాత్రం అంతులేని నష్టాల్లో కూరుకుపోతున్నాడు. అయితే, ముడి సరుకు ప్రభుత్వమే అందజేస్తే ఆసామికి కొంత గిట్టుబాటుగా ఉండేది. కానీ పెట్టుబడి భారం, పెరిగిన నిర్వహణ ఖర్చులు, గిట్టుబాటు కాని కూలితో ఆసామి బతుకు అప్పుల ఊబిలో చిక్కుకుపోయింది. పరిశ్రమ బండిని లాగుతున్నా, ఫలాలు మాత్రం ఇతరులకే దక్కుతుండటంతో సిరిసిల్ల ఆసామి గాథ అరణ్యరోదనగా మారుతోంది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అంటేనే కార్మికులు, ఆసాములు, యజమానులతో కూడిన సంక్లిష్టమైన మూడెంచెల వ్యవస్థ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు ఏడాదిన్నరకుపైగా ఆర్డర్లు లేక వెలవెలబోయిన పరిశ్రమకు.. 'ఇందిరా మహిళా శక్తి' చీరల పథకం కింద 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ జీవం పోసింది. దీనికి తోడు గత ప్రభుత్వ బకాయిలు రూ.280 కోట్లు విడుదల చేయడం, పాఠశాల యూనిఫాం ఆర్డర్లు ఇవ్వడం, యారన్ డిపో ఏర్పాటు వంటి చర్యలు పరిశ్రమకు ఊతమిచ్చాయి. ఆగస్టు 15 నాటికి చీరలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పైకి అంతా బాగున్నట్టు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

ఆసామికి మిగిలేది సున్నే..

ఈ మొత్తం ప్రక్రియలో తీవ్రంగా నష్టపోతున్నది ఆసాములే. ప్రభుత్వం ఇచ్చే ఆర్డర్లను దక్కించుకునేది రూ.కోట్లలో పెట్టుబడి పెట్టగల స్థోమత ఉన్న కొద్దిమంది యజమానులే. ముడిసరుకుపై పెట్టుబడి పెడుతున్న వీరు ప్రభుత్వం నుంచి మీటరుకు వచ్చే రూ.34లో సుమారు రూ.8లాభంగా తీసుకుంటున్నారు. మిగిలిన మొత్తాన్ని ఆసాములు, కార్మికులకు కూలిగానూ, ఇతర ఖర్చుల కింద పంచుతున్నారు. ఆసామికి దక్కే మీటరు కూలి రూ.11 మాత్రమే. ఇందులో రూ.5 కార్మికునికి చెల్లిస్తే, ఆసామికి మిగిలేది రూ.6 మాత్రమే. ఈ ఆరు రూపాయలతోనే అతను అన్ని ఖర్చులూ భరించాలి. మరమగ్గాన్ని (సాంచె) కొత్త ఆర్డర్‌కు సిద్ధం చేయడానికి ఆసామికి సుమారు రూ.10వేల వరకు ఖర్చు అవుతోంది. అందులో వైపర్ కార్మికునికి ఒక్కో బీము నింపేందుకు రూ.1,200, నక్ష జాలెలకు రూ.800, కొత్త డిజైన్ జాలెలకు రూ.3,800, రీడ్ మార్పు (64 నుంచి 84కు మార్చేందుకు) రూ.వెయ్యి, డిజైన్ వేసే వ్యక్తికి రూ.2,500.. వీటికి అదనంగా కండెలు, కరెంటు బిల్లు, జాపర్ల వంటి ఖర్చులు ఉంటాయి. ప్రతి 50 మీటర్ల బట్ట ఉత్పత్తి తర్వాత బీము మార్చినప్పుడల్లా వైపర్ కార్మికునికి రూ.1200 చెల్లించాల్సిందే. ఇంత ఖర్చు భరించి, మీటరుకు రూ.6 సంపాదిస్తే, నష్టాలు తప్ప లాభాలు ఎలా వస్తాయని ఆసాములు ప్రశ్నిస్తున్నారు. శ్రమ తాము చేస్తుంటే, ఏ పనీ చేయని యజమానులు రూ.కోట్లు గడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల కొరతతో అదనపు భారం

ఆర్డర్లు లేని సమయంలో కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూసుకోవడంతో ఇప్పుడు పరిశ్రమ తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటోంది. కొత్త తరం ఈ వృత్తిలోకి రాకపోవడం, ఉన్న కార్మికుల్లో చాలామంది 50 ఏండ్లు పైబడిన వారు కావడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. వయసు పైబడటంతో దారం పోగులు సరిగా కనిపించక, పని వేగంగా సాగక కొందరు మానేస్తున్నారు.

దీంతో ఆసాములు కార్మికులను బతిమలాడి పనికి పిలుచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆర్డర్లు పూర్తి చేయలేక నష్టపోతున్నారు. లక్ష్యాలు పూర్తి చేయని సొసైటీల ఆర్డర్లు రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించడం వారిని మరింత ఆందోళనలోకి నెడుతోంది. మొత్తంగా ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా, పరిశ్రమలోని అంతర్గత దోపిడీ వ్యవస్థను ప్రక్షాళన చేయనంత కాలం ఆసాముల బతుకులు మారవన్నది అక్షర సత్యమనే చెప్పాలి. కార్మికులతోపాటు పరిశ్రమకు వెన్నెముకగా ఉన్న ఆసాములను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యజమానుల గుప్పిట్లో పరిశ్రమ

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కేవలం పది మంది బడా యజమానుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. వీరే ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న నేతలుగా, స్థానిక సంస్థల ప్రతినిధులుగా చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం ఆర్డర్లను మ్యాక్స్ సొసైటీలు, చిన్న తరహా పరిశ్రమలకు కేటాయిస్తున్నా, రూ.కోట్లలో పెట్టుబడి పెట్టే శక్తి లేని ఆసాములు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ యజమానులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పథకాల ఫలాలు, రాయితీలు నేరుగా ఆసాములకు చేరకుండా యజమానుల జేబుల్లోకి వెళ్తున్నాయి.

అన్నీ భారమే..

మీటరుకు ఆరు రూపాయలు లాభం అంటూ యజమాని చేతిలో పెడతాడు. ఇందులో కరెంట్ బిల్లు, మిషన్ మరమ్మతులు, కార్మికుడికి ముందస్తు కూలి అన్నీ భారమే. నెలాఖరుకు నేను సంపాదించేది కాదు అప్పు మాత్రం పెరుగుతుంది.

- ఆడెపు మోహన్, ఆసామి, సిరిసిల్ల

ముడి సరుకు ప్రభుత్వమే ఇవ్వాలి

సొసైటీ పేరు మీద ఆర్డర్ వచ్చినా మేము ఉత్పత్తి చేయాలంటే ముడిసరుకు కోసం బడా యజమాని దగ్గరికే వెళ్లాలి. సాంచెల మరమ్మతు, జాలెలు, బీము పెట్టే కార్మికులు, సహా ఇతర ఖర్చులు పెరిగిపోయాయి. చేతితో బట్ట నేస్తున్నాంగానీ లాభాలు మాత్రం పెద్దవాళ్ల జేబుల్లోకి పోతున్నాయి. దీన్ని ఎలా న్యాయంగా చెప్తారు? మాకు ప్రభుత్వమే ముడిసరుకు ఇవ్వాలి.

రవీందర్, ఆసాముల సంఘం సమన్వయ కమిటీ అధ్యక్షులు